
వృథాగా పోతున్న వరద నీరు

చెక్ డ్యాంలు నిర్మిస్తే తాగు, సాగు నీటి సమస్యకు పరిష్కారం


వృథాగా పోతున్న మునేటి వరద నీరు

పెనుగంచిప్రోలు: మునేరుకు ప్రతి ఏడాది వచ్చే వర్షం, వరద నీరు వృథాగా కృష్ణానది లోకి, తరువాత సముద్రం పాలవుతోంది. లక్షల క్యూసెక్కుల నీరు వృథా అవుతోంది. ప్రతి ఏడాది వర్షాకాలం అంతా నీరు ఈ విధంగా వృథాగా పోతుంటే వేసవిలో తాగునీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు పడాల్సివస్తోంది. మునేరుకు తెలంగాణలో పలు చోట్ల చెక్‌డ్యాంలు ఉండగా ఆంధ్రాలో మాత్రం ఎక్కడా వాటి నిర్మాణం లేదు. చెక్ డ్యాంలు నిర్మిస్తే సాగు, తాగునీటి అవసరాలు తీరుతాయి.

కృష్ణానదిలో కలుస్తున్న వరద నీరు..

మునేరుకు తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్, ఖమ్మం జిల్లాల్లో కురిసిన వర్షాలకు ప్రతి ఏడాది భారీగా వరదలు వస్తాయి. గత ఏడాది సెప్టెంబర్ నెలలో మునేరుకు భారీ వరదలు వచ్చాయి. అలాగే ఈ ఏడాది కూడా మునేరుకు వరద నీరు వస్తూనే ఉంది. వత్సవాయి మండలం పోలంపల్లి వద్ద బ్రిటీష్ వారి కాలంలో మునేరుపై నిర్మించిన చిన్నపాటి ఆనకట్ట వల్ల 0.13 టీఎంసీల నీరు నిల్వ ఉండి మునేటి కాలువల ద్వారా వత్సవాయి, పెనుగంచిప్రోలు, నందిగామ మండలాల్లోని సుమారు 25 వేల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. వర్షాలు, వరదలకు రోజుకు సుమారు 25 వేల క్యూసెక్కుల నీరు కృష్ణానదిలో కలుస్తాయి. తెలంగాణ నుంచి ఆంధ్రాలోకి ప్రవహించే మునేరు వత్సవాయి, పెనుగంచిప్రోలు, నందిగామ మండలాల మీదుగా ప్రవహించి కీసర వద్ద మధిర ఏరుతో కలిసి కంచికచర్ల మండలం మోగులూరు వద్ద కృష్ణానదిలో కలుస్తుంది. అనువైన ప్రాంతంలో చెక్‌డ్యాంలు నిర్మిస్తే వరద నీరు నిలిచి వేసవిలో తాగు, సాగునీటి అవసరాలకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. అలాగే మునేటిపై నిర్మించిన తాగునీటి పథకాలకు, ఎత్తిపోతల పథకాలకు భూగర్భ జలాలు పెరిగి మరింత సౌకర్యవంతంగా ఉంటుంది.

చెక్‌డ్యాంలు నిర్మిస్తే భూగర్భ జలాలు పెరుగుతాయి



మునేరుపై ప్రస్తుతం పోలంపల్లి వద్ద బ్రిటీషు వారి కాలంలో ఏర్పాటు చేసిన ఆనకట్ట మాత్రమే ఉంది. ప్రతి ఏడాది వర్షం నీరు, వరద నీరు అంతా వృథాగా పోతోంది. మునేటిపై అనువైన ప్రదేశంలో రైతుల పొలాలకు ఇబ్బంది లేకుండా చెక్ డ్యాంలు నిర్మిస్తే నీరు నిల్వ ఉండి భూగర్భ జలాలు పెరగటంతో పాటు తాగునీటి, సాగు నీటి సమస్యలు పరిష్కారం అవుతాయి.

–ఏలూరి శివాజీ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు

కృషి, అనుభవం ద్వారా రైతులకు అవగాహన

నందిగామ రూరల్: వ్యవసాయ విద్యార్థులకు గ్రామీణ అవగాహన, కృషి, అనుభవం ఎంతో ముఖ్యమని గరికపాడు కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ రవికిషోర్ అన్నారు. మండలంలోని పల్లగిరి గ్రామంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు బుధవారం గ్రామీణ అవగాహన, కృషి, అనుభవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి, అనుభవ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ వ్యవసాయ విధానాలు, స్థితిగతులను తెలుసుకుని గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణ కార్యక్రమం ద్వారా అధ్యయనం చేస్తారన్నారు. అనంతరం గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని గ్రామ పటం, సాగు విస్తీర్ణం, వ్యవసాయ భూముల విస్తీర్ణం, సీజనల్ క్యాలెండర్,


పల్లగిరిలో రంగవల్లుల ద్వారా రైతులకు అవగాహన కలిగిస్తున్న వ్యవసాయ విద్యార్థులు

మొబిలిటీ మ్యాప్, ట్రెండ్ చార్టులు, సమన్వయ రేఖ, తదితర అంశాలను రంగవల్లులు, చిత్ర పటాల ద్వారా పరిష్కార మార్గాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త వెంకట రెడ్డి, సర్పంచ్ చాగంటి రవికిరణ్‌రెడ్డి, రైతులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

అనుమంచిపల్లి(జగ్గయ్యపేట): ఖరీఫ్ సీజన్‌లో నియోజకవర్గ వ్యాప్తంగా ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ భవాని అన్నారు. గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలుపై రైతులకు బుధవారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 22 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ధాన్యం రైతులు కోత తేదీలను వీఏవోకు సమాచారం అందించాలని చెప్పారు. ధాన్యం తేమ శాతం 17 శాతం ఉండేలా చూడాలని, గోనె సంచుల ఖర్చులు,


మాట్లాడుతున్న ఏడీఏ భవాని

హమాలీ ఖర్చులను కూడా ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పారు. ట్రక్ షీట్ జనరేట్ చేసి ఆన్‌లైన్ చేసిన తరువాతే ధాన్యాన్ని మిల్లులకు తీసుకెళ్లాలని సూచించారు. రైతులు తమ వాహనాలకు జీపీఎస్ అమర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో వరలక్ష్మి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పత్తి రైతును ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

నందిగామరూరల్: పత్తి రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్నీడి యలమందరావు అన్నారు. మండలంలోని పల్లగిరి, మాగల్లు, రామిరెడ్డి పల్లి, జొన్నలగడ్డ గ్రామాలలోని పత్తి పంటను వామ పక్ష పార్టీలు, రైతు సంఘ నాయకులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పత్తి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఎకరాకు మూడు నుంచి నాలుగు క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. ముఖ్యంగా కురుస్తున్న వర్షాలు ఎగువ నుంచి వస్తున్న వరదతో పత్తి పంట పూర్తిగా దెబ్బతినటంతో రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పత్తికి క్వింటాకు


పల్లగిరిలో పత్తి పంటను పరిశీలిస్తున్న వామపక్ష, రైతు సంఘ నాయకులు

రూ.10వేల మద్దతు ప్రకటించటంతో పాటు సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చుండూరు సుబ్బారావు, వెంకట రామారావు, శ్రీనివాసరావు, కృష్ణంరాజు, రైతులు పాల్గొన్నారు.

సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేయాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పత్తి రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన రూ.8,110 ధరతో సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా పత్తిని కొనుగోలు చేయాలని ఆయన కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ నేతలతో కలిసి ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు 20 వేల ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగుచేస్తున్నారన్నారు. గత ఏడాది మిర్చి పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో మిర్చిను అమ్ముకోలేక రైతులు ఇంకా మిర్చిని కోల్డ్ స్టోరేజ్‌లలో నిల్వ ఉంచారన్నారు. మిర్చి పంటకు రేటు ఉంటుందో లేదో తెలియక ఈసారి రైతులు అధికంగా పత్తి పంటను సాగుచేశారన్నారు. పత్తి ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్లు పండుతుందన్నారు. కానీ రైతులు పత్తి పంటను వేసినప్పటి నుంచి అధిక వర్షాలు కురవడంతో దిక్కుతోచని


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు

పరిస్థితుల్లో పడ్డారని తెలిపారు. ఇప్పటి వరకు మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేయలేదని, కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధర పత్తి క్వింటాకు రూ 8,110లతో పత్తిని వ్యవసాయ అధికారులు రైతుల వద్ద నుంచి కొగుగోలు చేసి దళారీల వ్యవస్థ నుంచి రైతులను కాపాడాలన్నారు. జగ్గయ్యపేట మార్కెట్ యార్డులో రానున్న 3,4 రోజుల్లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని, లేని పక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతుల పక్షాన ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

ఆలయ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరసన

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలోని యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వేతనాలు అందించాలంటూ ఆలయం ఎదుట బుధవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయంలో గత 15 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నామని, అయితే గత ఎనిమిది నెలలుగా వేతనాలు ఇవ్వకపోవటంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. వేతనాలివ్వాలని అధికారులను వేడుకుంటున్నా పట్టించుకోవటం లేదన్నారు. ఉద్యోగంలో చేరిన సమయంలో ఎన్ఎంఆర్‌లుగా తీసుకున్నారని, అయితే ఏడాది క్రితం అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా విధులు నిర్వహించాలంటూ దేవదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చారని చెప్పారు. అవుట్ సోర్సింగ్‌లుగా కాకుండా ఎన్ఎంఆర్‌లుగానే ఉంచాలంటూ కోర్టును ఆశ్రయించామని తెలిపారు. వేతనాలు అందక కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయ ఈవో సురేష్ మాట్లాడుతూ వేతనాలు చెక్కు రూపంలో ఇస్తున్నా తీసుకోవటం లేదని, పలువురు కోర్టును ఆశ్రయించటంతో వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. అనుమతులు లేకుండా ఆందోళన చేయటంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పటంతో ఉద్యోగులు ఆందోళన విరమించారు.


ఆలయం వద్ద ఆందోళన చేస్తున్న ఆలయ సిబ్బంది

మిక్ ఇంజినీరింగ్ కాలేజీలో ఇన్నోవేషన్ డే

కంచికచర్ల: స్థానిక మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో ఇనిస్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్(ఐఐసీ) ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి, భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకల సందర్భంగా బుధవారం ఇన్నోవేషన్ డే కార్యక్రమం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.వంశీకిరణ్ తెలిపారు. ఇన్నోవేషన్ ప్రాముఖ్యత గురించి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మహోన్నత ప్రయోగాల గురించి, భారతదేశం గర్వించదగ్గ అనేక మంది శాస్త్రవేత్తల గురించి ప్రిన్సిపాల్ విద్యార్థులకు వివరించారు. ఇన్నోవేషన్ ఐడియా చాలెంజస్, డొమైన్ స్పెసిఫిక్ రీసెంట్ ఇన్నోవేషన్ వంటి పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సీఈఓ డి.పాండురంగారావు, మేనేజ్‌మెంట్ మెంబర్ ఎం.సుహాస్, ఈసీఈ విభాగాధిపతి సీహెచ్ పుల్లారావు, కోఆర్డినేటర్ డాక్టర పి.రజినీకుమారి, పలు విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీఎస్టీ నూతన విధానంతో తగ్గిన పన్నుభారం

నందిగామ రూరల్: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్య తరగతి ప్రజలపై పన్ను భారం తగ్గుతోందని గ్రంథాలయ అధికారి రామచంద్రుడు తెలిపారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో బుధవారం జీఎస్టీ నూతన విధానంపై విద్యార్థులు, పాఠకులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా, వైద్య రంగాలకు జీఎస్టీని దాదాపుగా తగ్గించిందన్నారు. పుస్తకాలు, జామెట్రీ బాక్సులు, పెన్నులు, పెన్సిళ్లు, తదితర విద్యారంగ వస్తువులపై జీఎస్టీను పూర్తిగా తొలగించిందని తెలిపారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల నివారణకు వినియోగించే మందులపై కూడా జీఎస్టీని పూర్తిగా తొలగించిందని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

పారిశుధ్య మెరుగుదలకు ప్రత్యేక చర్యలు

నందిగామ రూరల్: గ్రామీణ ప్రాంతాలలో పారిశుధ్య మెరుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ ఎంపీడీవో నామేశ్వరరావు తెలిపారు. మండలంలోని ఐతవరం గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ముఖ్యంగా గ్రామాలలోని మురుగు కాల్వల్లో పూడిక తీత, పిచ్చి మొక్కల తొలగింపు, జాతీయ రహదారి పక్కనున్న చెత్తాచెదారాన్ని తొలగించినట్లు తెలిపారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా తడి, పొడి చెత్తను వేర్వేరుగా పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి జీవనజ్యోతి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

కలాం జీవితం యువతకు ఆదర్శం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు


కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ నేతలు


పేటలో అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: భారత మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాం జీవితాన్ని నేటి యువత, విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. భారతరత్న, మిస్సైల్‌మాన్ డాక్టర్ అబ్దుల్ కలాం 94 వ జయంతి వేడుకలు పట్టణంలో బుధవారం వైఎస్సార్ సీపీ పట్టణ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కోదాడ రోడ్‌లోని అబ్దుల్ కలాం విగ్రహానికి తన్నీరు నాగేశ్వరరావు పలువురు పార్టీ నేతలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనివాసగౌడ్, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి నంబూరి రవి, రాష్ట్ర చేనేత విభాగం అధికార ప్రతినిధి పెంటి శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి దర్శనాల వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా వైకుంఠరావు, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు బజారు సాయి, జిల్లా రైతు విభాగం కార్యదర్శి మోరె దుర్గాప్రసాద్, జిల్లా మైనార్టీ సెల్ కార్యవర్గ సభ్యుడు షేక్ ఖాదర్, జిల్లా చేనేత విభాగం కార్యదర్శి దేవర శెట్టి ఆంజనేయులు, వివిధ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

దేశ కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి కలాం

–ఎమ్మెల్యే తాతయ్య

అతి సాధారణ కుటుంబంలో పుట్టి అసాధారణ ప్రజ్ఞా పాటవాలతో భారతదేశ మిసైల్‌మ్యాన్‌గా, భారతదేశ 11 వ రాష్ట్రపతిగా డాక్టర్ అబ్దుల్ కలాం అందించిన సేవలు ఆదర్శనీయమని, మన దేశ కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచానికి చాటిన మహోన్నత వ్యక్తి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటుచేసిన అబ్దుల్ కలాం చిత్ర పటానికి పలువురు నేతలతో కలిసి ఆయన నివాళులర్పించారు. టీడీపీ నాయకులు కట్టా నరసింహారావు, మైనేని రాధా, తాటి రామారావు, కోట పురుషోత్తం, మార్కపూడి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ ఆధ్వర్యంలో...

భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం జీవితం ఎందరికో ఆదర్శనీయం అని జనసేన పార్టీ నాయకులు అన్నారు. పట్టణంలోని జనసేన పార్టీ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కోదాడ రోడ్‌లోని అబ్దుల్ కలాం విగ్రహానికి ఆ పార్టీ నేతలతో కలిసి మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, జనసేన నాయకులు చారుగుండ్ల కొండ, కొత్తా పురుషోత్తం, ఆవాల భవానీప్రసాద్, బాలకోటి, మేడూరి వెంకటాద్రి, వీర మహిళ శిరీష తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో...

నందిగామ టౌన్: శాస్త్రవేత్తగా, భారత రాష్ట్రపతిగా ఏపీజే అబ్దుల్ కలాం దేశానికి వెలకట్టలేని సేవలను అందించారని గ్రంథాలయ అధికారి రామచంద్రుడు అన్నారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కలాం చిత్ర పటానికి విద్యార్థులు, పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం లలితజ్యోతి, ఎస్‌కే నజీర్, జె.శ్రీనివాసరావు, ఎం.ప్రశాంతి, నళిని తదితరులు పాల్గొన్నారు.

గంప్రాయిలో...

గంప్రాయి(జగ్గయ్యపేట): భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను బుధవారం గ్రామంలోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలాం జీవితం యువతకు స్ఫూర్తిదాయకం


నందిగామ బీజేపీ కార్యాలయంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


నందిగామ బార్ అసోసియేషన్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

నందిగామ రూరల్: భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని బీజేపీ జిల్లా కార్యదర్శి పోరుగంటి నరసింహారావు అన్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో అబ్దుల్ కలాం జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు సైదా, మునగంటి కామేశ్వరరావు, కేదార్‌నాథ్‌శర్మ, రమాదేవి, జయశ్రీ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యాలయంలో...

శాస్త్రీయ పరిశోధన, రక్షణ సాంకేతిక రంగంలో భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం నిరుపమాన సేవలందించారని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద్రు బాబూ విద్యాసాగర్ అన్నారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా బుధవారం ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు అద్దంకి మణిబాబు, షేక్ ఆజాద్, కొమ్మినేని మోహేశ్వరరావు, సాంబశివరావు, సత్యనారాయణ మూర్తి, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

కులతో కలిసి ఆయన పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు.

కంభంపాడులో...

కంభంపాడు(వత్సవాయి): దేశాన్ని రక్షణరంగంలో అగ్రపథంలో నిలిపిన వ్యక్తి మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అని జెడ్పీ పాఠశాల హెచ్ఎం వీవీఆర్ అన్నారు. కలాం జయంతిని పురస్కరించుకుని

వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు అవలంబించాలి

చందర్లపాడు(నందిగామటౌన్): వ్యవసాయంలో రైతులు ఆధునిక సాంకేతిక పద్ధతులను అవలంబించాలని గరికపాడు కేవీకే కోఆర్డినేటర్ రవికిషోర్ అన్నారు. చందర్లపాడు గ్రామంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు బుధవారం గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త వెంకట రెడ్డి, రైతులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు సైన్స్, టెక్నాలజీపై ఆసక్తి పెంచుకోవాలి

పెనుగంచిప్రోలు: విద్యార్థులు సైన్స్, టెక్నాలజీపై ఆసక్తి పెంచుకుని అబ్దుల్ కలాం లాగా శాస్త్రవేత్తలుగా ఎదగాలని జాతీయ ఉపాధ్యాయ సేవాదళ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డి.శ్రీను అన్నారు. స్థానిక ఎస్ఎస్‌పీఎం జెడ్పీ బాలికల హైస్కూల్‌లో బుధవారం అబ్దుల్ కలాం జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఉపాధ్యాయ సేవాదళ్ తరఫున పెనుగంచిప్రోలు మండలాన్ని దత్తత తీసుకుంటున్నామన్నారు. అనంతరం గ్రామంలోని సైన్స్ ఉపాధ్యాయులను కలాం సైన్స్ పురస్కారాలతో, 22 మంది విద్యార్థులను జూనియర్ సైంటిస్ట్‌ల పేరుతో సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం నక్కా బాబూరావు, డెమోక్రటిక్ పీఆర్‌టీయూ అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు ముక్కా సత్యనారాయణ, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బస్‌షెల్టర్‌పై పచ్చనేతల కన్ను



కంచికచర్ల మండలం కీసరలో జాతీయ రహదారిపై ప్రయాణికుల సౌకర్యార్థం నేషనల్ హైవే అధికారులు నిర్మించిన ఆర్టీసీ బస్ షెల్టర్‌పై టీడీపీ నేతల కన్ను పడింది. దానిని కూల్చివేసి కాంప్లెక్స్ నిర్మించాలని కుటిల ప్రయత్నం చేస్తున్నారు. కాంప్లెక్స్‌లు నిర్మించి తద్వారా వచ్చే ఆదాయాన్ని దోచుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. నేషనల్ హైవే అధికారులు స్పందించి బస్‌షెల్టర్‌లను కూల్చివేయకుండా చూడాలని ప్రయాణికులు పలు గ్రామాల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

– కంచికచర్ల

క్లుప్తంగా

నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు

నందిగామ రూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ హెచ్చరించారు. పట్టణంలోని చందర్లపాడు రోడ్డులో బుధవారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలలో తలకు గాయాలై మృత్యువాత పడుతున్న వారి సంఖ్య అధికంగా ఉంటోందని హెల్మెట్ ధరించటం వల్ల అటువంటి ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ముఖ్యంగా లైసెన్స్‌తో పాటు వాహనాలకు సంబంధించిన పత్రాలు వెంట ఉంచుకోవాలని తెలిపారు. మైనర్‌లకు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేయటంతో పాటు కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం రికార్డులు సక్రమంగా లేకుండా తిరుగుతున్న పలు వాహనాలను గుర్తించి జరిమానా విధించారు. ట్రాఫిక్ ఏఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మంగొల్లు(వత్సవాయి): అనారోగ్యంతో మరణించిన సంఘ సభ్యుడికి రూ.10 వేలు ఆర్థికసాయాన్ని బుధవారం అందజేశారు. గ్రామానికి చెందిన నలబోతు సత్యనారాయణ స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (సొసైటీ)లో సభ్యుడిగా ఉన్నారు ఇటీవల ఆయన అనారోగ్యంతో మృతిచెందారు. మృతిచెందిన సభ్యుడి కుటుంబసభ్యులకు రూ.10వేలను సొసైటీ అధ్యక్షుడు బొల్లం పురుషోత్తం అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి వనం నరసింహారావు, గ్రామస్తులు మన్నె నారాయణరావు, కాకనబోయిన పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

జీవన ఎరువుల ఉపయోగంపై అవగాహన

బూదవాడ(జగ్గయ్యపేట): రైతులు జీవన ఎరువులు పశువుల దాణా తయారీపై అవగాహన కలిగి ఉండాలని కేవీకే కోఆర్డినేటర్ రవికిషోర్ అన్నారు. గ్రామంలోని సచివాలయంలో జీవన ఎరువులు, పశువుల దాణా తయారీపై బుధవారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవన ఎరువుల వాడకం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. శాస్త్రవేత్తల సలహాలు, సూచనలతో జీవన ఎరువులను తయారు చేసుకోవాలన్నారు. అనంతరం ఎరువుల వాడకం గురించి వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శివప్రసాద్, జశ్వంత్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రామ్‌కో ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం

కె.అగ్రహారం(జగ్గయ్యపేట): గ్రామంలోని పశు వైద్యశాలలో రామ్‌కో సిమెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని పశు సంవర్ధక శాఖ ఏడీఏ భవానీ ప్రసాద్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు యజమానులు పశువులకు సోకే వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం 150 పశువులు, 230 గొర్రెలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామ్‌కో సీనియర్ ప్రెసిడెంట్ ఆశిష్‌కుమార్ శ్రీవత్సవ, అడ్మిన్ ఫరూఖ్ మహ్మద్, వైద్యులు కేశవప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా చెస్‌లో చెవిటికల్లు వాసి ప్రతిభ

కంచికచర్ల: ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మహారాష్ట్ర లోని అహల్యానగర్‌లో ఇటీవల నిర్వహించిన సీనియర్ నేషనల్ ఆర్బిటర్ సెమినార్ ఎగ్జామ్‌లో మండలంలోని చెవిటికల్లుకు చెందిన గుజ్జర్లపూడి చెన్నకేశవులు ఉత్తమ ప్రతిభ కనపర్చి అవార్డు అందుకోవటం అభినందనీయమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య అన్నారు. భవిష్యత్‌లో ఎంతో మందిని చెస్ చాంపియన్లగా తీర్చిదిద్దాలని ఆమె సూచించారు.

క్షీర బంధు పథకం కింద రూ.50 వేల చెక్కు పంపిణీ

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): గ్రామంలోని విజయ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో పాలు పోస్తున్న సభ్యురాలు జంగాల వెంకట నరసమ్మ మృతి చెందటంతో బుధవారం కృష్ణా క్షీరబంధు పథకం కింద రూ.50 వేల చెక్కును ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, సంఘ అధ్యక్షుడు కొత్తపల్లి రామనాథం, పాలకేంద్రం మేనేజర్ నరేంద్ర, సంఘ సభ్యులు, రామకృష్ణ, కోటిబాబు, సూపర్‌వైజర్ నరసింహారావు పాల్గొన్నారు.

గూగుల్ డేటా సెంటర్‌తో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి

జగ్గయ్యపేట అర్బన్: గూగుల్ డేటా సెంటర్ రాకతో మన రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. ఎమ్మెల్యే తాతయ్య నివాసంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గూగుల్ క్లౌడ్ సంస్థను రాష్ట్రానికి తీసుకురావడంలో లోకేష్, మంత్రివర్గం చేసిన కృషి అభినందనీయం అన్నారు. హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ రాకతో టెక్నాలజీ రంగం ఎంతగా అభివృద్ధి చెందిందో, విశాఖలో గూగుల్ రాక రాష్ట్ర భవిష్యత్ గేమ్ చేంజర్‌గా నిలుస్తుందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మండల టీడీపీ అధ్యక్షుడు కట్టా నరసింహారావు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.